క్లుప్తంగా

విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థినులతో పాఠశాల స్పెషలాఫీసర్

అట్లూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ఆటల పోటీలలో ప్రతిభ కనబరచినట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ పణిశ్రీ,, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీళా తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు చెన్నైలో జరిగిన అండర్–19 జూనియర్ సౌత్ జోన్ టెన్నీస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్‌లో ఈ పాఠశాల నుంచి 8 మంది విద్యార్థినులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులను అభినందించారు.

మంత్రి సత్యకుమార్‌కు వినతి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకటవేముల హరినారాయణ

ప్రొద్దుటూరు: మచిలీపట్నం టు ధర్మవరం రైలును బెంగళూరు వరకు పొడించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి అరకటవేముల హరినారాయణ విజయవాడలో గురువారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా హరినారాయణ మాట్లాడుతూ మచిలీపట్నం టు ధర్మవరం రైలు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మీదుగా బెంగళూరు వరకు పొడిగించడం వలన ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళతానని మంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లె మున్సిపల్ హైస్కూల్‌ను గురువారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సందర్శించారు. పాఠశాలలోని పలు సమస్యలను ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనుల కింద నిర్మించిన మూడు అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆనంద నిలయం హాస్టల్‌లో నుంచి తరగతి గదులకు వెళ్లడానికి కాంపౌండు తొలగించి గేటు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా బాలజోజి

కలసపాడు : మండలం నుంచి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఈరిబాలజోజిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.బాలఓబయ్య తెలిపారు. జిల్లా యూటీఎఫ్ భవనంలో జరిగిన స్వర్ణోత్సవ మహాసభలలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన బాలజోజి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

బద్వేలు అర్బన్ : ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా ఇన్‌చార్జి సగిలిగుర్రప్ప డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని రామాంజనేయనగర్‌లో దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించిన మాట్లాడారు. పేద కుటుంబంలో పుట్టినప్పటికీ కష్టపడి చదువుతూ ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉండిన దస్తగిరమ్మ ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురికావడం బాధాకరమన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరామ్, బద్వేలు అసెంబ్లీ అధ్యక్షుడు నుసిమిగాస్‌పీర్, మహిళా విభాగం జిల్లా నాయకురాలు బేబీ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు

కలసపాడు : రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రోడ్డు మలుపులో ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించామని పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు, స్థానిక ఎస్‌ఐ చిరంజీవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సింగరాయపల్లె వద్ద బుధవారం తుఫాన్ వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన ప్రమాద స్థలాన్ని పరిశీలించి కలసపాడు నుండి గంగయ్యపల్లె వరకు రోడ్డును పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను గురువారం జేసీబీ ద్వారా తొలగించడం జరిగిందన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యగా పనులు చేపట్టామని తెలిపారు.

లాభాల కాలిబాట

- వరిసాగులో ఎంతో ప్రయోజనం
- చీడపీడల నుంచి పంటకు రక్షణ
- దిగుబడి పెరిగే అవకాశం

రాజుపాళెం: వరి పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వలన పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉందని, తెగుళ్ల నివారణకు వరి నాట్ల సమయంలో కాలిబాటలను వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వరి నాట్లలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వలన బహుళ ప్రయోజనాలున్నాయని, ముఖ్యంగా పైరు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో ఏపుగా పెరుగుతుందని రాజుపాళెం మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలోని కుందూనది, కేసీ చాపాడు కాలువ కింద 1,976 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు.



కాలిబాట వేసిన వరి పంట



రాజుపాళెంలో వరి పంటను నాటుతున్న కూలీలు

కాలిబాటలతో ప్రయోజనాలు

- వరిలో తెగుళ్ల సమర్థవతంగా తట్టుకునేందుకు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరంగా కాలిబాటలను వేసుకోవాలి. కాలిబాటలలో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది.
- పంటకు గాలి సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది.
- అగ్గి తెగుళ్ల, సుడిదోమ వ్యాప్తిని అదుపు చేయవచ్చు
- ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది.
- కిరణ జన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కల్లో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంటల దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.
- ఎరుకలను సమర్థవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

బహుళ ప్రయోజనాలు



వరి పంటలో కాలిబాటలు తీయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి రైతు వరి పంట నాటిన మూడు రోజుల నుంచి కాలిబాటలు తీసుకోవాలి. కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వలన బహుళ ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా పైరుకు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో పాటు ఏపుగా పెరుగుతుంది. దీంతో తెగుళ్ల, చీడపీడలు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది. – శివరామ కృష్ణారెడ్డి, ఏఓ, రాజుపాళెం

గొచ్చులుగా నాటొద్దు

- వరి కుదుళ్లను గొచ్చులుగా నాటడం వలన పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతో పాటు చీడపీడలు త్వరగా ఆశిస్తాయి.
- సాధారణంగా ఎక్కువ వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారని, అయితే ఇది సరైన పద్ధతి కాదు.
- వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్ల ఎక్కువగా సోకే అవకాశం ఉంది.

పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలి

బద్వేలు అర్బన్: పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి పన్ను బకాయిలు పేరుకుపోయిన యజమానులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు రూ.1.61 కోట్లు పన్నులు బకాయి ఉన్నాయని సంబంధిత కార్యాలయాలకు నోటీసులు అందజేశామని, వీలైనంత త్వరగా ఉన్నతాధికారులతో మాట్లాడి బడ్జెట్ విడుదల చేయించుకుని పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

మున్సిపాలిటీ పరిధిలోని పొదుపు సంఘాలను బలోపేతం చేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా మెప్మా సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మెప్మా సీఓలు, ఆర్పీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన



పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

మాట్లాడుతూ మున్సిపాలిటీలోని విలీన గ్రామాల్లో ఆసక్తి గల వారికి పాడిపశువులు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇప్పించాలని కోరారు. అలాగే ఆర్థికంగా వెనుకబడి ఆయా లేఅవుట్లలో ఇల్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. చెత్త రోడ్లపై వేయకుండా, నీటిని పొదుపుగా వాడుకునేలా పొదుపు సంఘాలలోని సభ్యులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

పాడి పశుపోషణను లాభదాయకంగా మార్చాలి

ప్రొద్దుటూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కు మంది ప్రజలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నందున పాడి పశుపోషణను లాభదాయకంగా మార్చాలని పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మూడు రోజుల జాతీయ సదస్సులో భాగంగా కళాశాలలో గురువారం రెండో రోజు పలువురు శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ ద్వారా పశుయాజమాన్య పద్ధతులను మెరుగుపరచడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. పాడి పశుపోషణకు ఆధునిక సాంకేతిక పద్ధతులను మేళవించాలని పేర్కొన్నారు. పాడిపశువులు అధిక పాలు, మాంసం, గుడ్లు పెంపొందించేలా పరిశోధనలను సాగించాలని సూచించారు. అనంతరం పరిశోధన పత్రాలను సమర్పించిన శాస్త్రవేత్తలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాస్త్రవేత్తలు, పశువైద్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తలకు మెమెంటోలు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్

మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

చాపాడు: ప్రభుత్వం మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు గురువారం కడప ఆర్డీఓ రామగిడ్డయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జీఎన్ఎం శిక్షణ పొందిన రెగ్యులర్ ఏఎన్ఎంలకు ప్రమోషన్ ఇవ్వాలని, సీనియర్ ఏఎన్ఎంలను ఎల్‌హెచ్‌వీ ట్రెనింగ్‌కు పంపాలని, ఎన్‌హెచ్ఎం ఏఎన్ఎంల రీ డిప్లయిమెంట్ రద్దు చేసి, వీరిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి వారిని రెగ్యులర్ చేయాలన్నారు. అలానే ఏప్రిల్‌లో రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్ల(మేల్)ను, ఏఎన్ఎంలకు హెల్త్ సూపర్‌వైజర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, క్షేత్ర స్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్‌ను పూర్తిగా రద్దుచేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జీతాలను ఎఫ్ఆర్ఎస్‌కు లింక్ చేయడం సరికాదని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని



కడప ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న టీఎన్ఎంఎస్ఈయూ సభ్యులు

ఆర్డీఓను కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎంఏసీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేల్పుల భాస్కర్ యాదవ్, జిల్లా అధ్యక్షులు మల్లయ్య, ఆసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ సాదు శీను, విజయ్‌కుమార్, అచ్చమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

మైదుకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం యోగివేమన విశ్వవిద్యాలయం (వైవీయూ)లో పుట్టగొడుగుల పెంపకంపై ఒక రోజు శిక్షణలో పాల్గొన్నారు. కళాశాలకు చెందిన ద్వితీయ, తృతీయ సంవత్సరం వృక్షశాస్త్ర విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా వైవీయూలోని బయో టెక్నాలజీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ చంద్రమతి శంకర్ పర్యవేక్షణలో పుట్టగొడుగుల పెంపకంపై ఒక రోజు శిక్షణలో పాల్గొన్నారు. చంద్రమతి శంకర్ విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపక విధానాన్ని వివరించారు. పుట్టగొడుగుల పెంపక పరిశ్రమను కుటీర పరిశ్రమగా స్వయం సమృద్ధి పెంపొందించుటలో మహిళలకు, గృహిణులకు చక్కటి సదావకాశమని తెలిపారు. పుట్టగొడుగుల పెంపకం నిపుణులు దిలీప్ పుట్టగొడుగుల పెంపకంలో వివిధ దశలను విద్యార్థులకు చేసి చూపించారు. ప్రొఫెసర్ తుమ్మల చంద్రశేఖర్ కణజాల వర్ధన ప్రయోగ విధానాన్ని, అనువర్తనాలను, అగ్రి సైన్స్ పార్క్ ల్యాబ్‌లోని అధునాతన పరికరాలను వాటి పనితీరును తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో నేర్చుకున్న అంశాలను ప్రయోగశాలలో పరిశీలించడం ద్వారా సులువుగా అర్థం చేసుకోవచ్చన్నారు. విశ్వవిద్యాలయంలో బొటానికల్ గార్డెన్ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, పరిశోధన విద్యార్థి సునీల్ కుమార్ విద్యార్థులకు బొటానికల్ గార్డెన్‌లోని వివిధ రకాల వన్య, ఔషధ వృక్ష జాతుల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకుడు పీవీ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ పాల్గొన్నారు.



విశ్వవిద్యాలయం వద్ద మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయాలి

చాపాడు : పుట్టిన ప్రతి బిడ్డకు 0 – 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని, బిడ్డకు పోలియో చుక్కలు ఇప్పించటం వలన వచ్చే వ్యాధి నిరోధక శక్తి జీవితాంతం బిడ్డకు రక్షణగా ఉంటుందని వైద్యాధికారి ఓబులేసు అన్నారు. ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని గురువారం చాపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పోలియోను నిర్మూలించేందుకు ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా ఐదేళ్ల లోపు పిల్లందరికీ రెండు దఫాలుగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇదే క్రమంలో పుట్టిన ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయటం జరుగుతుందని తల్లిదండ్రులు సైతం దీని పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మహాదేవయ్య, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్‌లు సరస్వతి, బాబురెడ్డి, ఫార్మసీ అధికారి సుభాషిణి, స్టాఫ్ నర్స్ సావిత్రి, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



పోలియో నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

మేళకువలు పాటిస్తే అధిక లాభాలు

బి.కోడూరు: గొర్రెల యజమానులు గొర్రెల పెంపకంలో మెళకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ రమణయ్య, ఏడీ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని మేకవారిపల్లె గ్రామంలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని సందర్శించి పాడి రైతులకు పలు సూచనలు, ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల యజమానులు సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందును గొర్రెలకు అందించాలన్నారు. మండలానికి 50 వేల డోసులు నట్టల నివారణ మందు వచ్చిందని, పాడిరైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభలవీడు పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య, పశువైద్య సహాయకులు నరసింహ, పాడి రైతులు పాల్గొన్నారు.



మేకవారిపల్లెలో గొర్రెలకు నట్టల నివారణ మందును తాపిస్తున్న పశువైద్యాధికారులు

మహిళలపై దాడులు అరికట్టాలి

ప్రొద్దుటూరు: మహిళల జీవించే హక్కును కాపాడి, వారిపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఉమెన్ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సమావేశం జరిగింది. మహిళా సంఘాలు, మేధావులతో కలసి ఉమెన్ జేఏసీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళల రక్షణపై జేఏసీ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. పట్టణంలోని స్కూళ్లు, కళాశాలల్లో, ప్రజల్లో మహిళలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధి భారతి, జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం ప్రతినిధులు ఉషారాణి, సునీత, వరలక్ష్మి, రాయలసీమ మహిళా ప్రతినిధి లక్ష్మీదేవి, జమా అతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ప్రతినిధులు రెహేనా, హసీనా, రాయలసీమ విద్యార్థి శక్తి ప్రతినిధి హరిత, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి పద్మ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉమెన్ జేఏసీ ప్రతినిధులు

ఘనంగా దస్తగిరి జెండా ఊరేగింపు



జెండాలను ఊరేగిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని దర్గావద్ద గ్యార్మీ పండుగ సందర్భంగా మహబూబ్ సుభహాని దస్తగిరి స్వామి జెండా ఉత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జెండాలను ట్రాక్టర్‌పై ఉంచి రాజాజీరోడ్డు, మెయిన్ బజార్, దర్గాబజార్, సుందరాచార్యుల వీధుల మీదుగా ఫకీర్ల మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని చక్కెరను చదివింపులు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎర్రబల్లి హిదాయత్, వేంపల్లి షేక్ అబ్దుల్లా, పర్వేజ్, గౌస్, షేక్‌హొసేన్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం ఉదయం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పెన్నానదిలో పెరుగుతున్న వరద నీటి ప్రవాహం



పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద నీరు

జమ్మలమడుగు: పెన్నానదిలో మైలవరం జలాశయం నుంచి విడుదల అవుతున్న వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇరిగేషన్ అధికారులు బుధవారం సాయంత్రం నుంచి 11 వేల క్యూసెక్కుల నీటిని దిగువనున్న పెన్నానదిలోకి విడుదల చేశారు. గురువారం కూడా ఇదే ఉధృతిని కొనసాగుతోంది. గండికోట జలాశయం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు మైలవరం జాలాశయంలోకి అధికారులు విడుదల చేశారు. ప్రజలు నది పరివాహక ప్రాంతాలలోకి వెళ్లకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

తాగునీటి పథకానికి మరమ్మతులు చేయరా?

గోపవరం: మండలంలోని రాచాయపేటలో దెబ్బతిన్న తాగునీటి పథకానికి మరమ్మతులు చేయరా అని గ్రామస్తులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. పథకానికి సంబంధించిన పైపు దెబ్బతిని 20 రోజులుగా నీరంతా వృథాగా పోతున్న విషయాన్ని అధికారులకు తెలిపినా ఇంత వరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. తాగునీటి పథకానికి సంబంధించిన పైపు పగలడంతో రోజుకు ఒకసారి మాత్రమే అది కూడా చాలీచాలకుండా నీటిని వదులుతుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏళ్ళ నాటి పథకం కావడంతో పెచ్చులూడటంతో కడ్డీలు బయటికి కనిపిస్తున్నాయి. దీంతో రానురాను పథకం శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న పైపును మార్చడంతో పాటు తాగునీటి పథకానికి పెచ్చులూడిన చోట వెంటనే మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాచాయపేటలో దెబ్బతిన్న తాగునీటి పథకం

గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరం

పోరుమామిళ్ల : మండలంలోని కొండుగారిపల్లెలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భకోశవ్యాధుల చికిత్సా శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో కడప డివిజన్ ఉపసంచాలకులు రమణయ్య, సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, పోరుమామిళ్ల పశువైద్యశాల సహాయ సంచాలకులు చంద్రశేఖర్, కలసపాడు పశువైద్యులు వెంకటేశ్వరరావు పాల్గొని పశువులకు చికిత్స చేశారు. 32 పశువులకు గర్భకోశ చికిత్సలు, 7 పశువులకు మెడికల్ చికిత్స, 4 పశువులకు శస్త్ర చికిత్సలు చేశారు. ఎదకు రాని పశువులకు, చూలు నిలబడని పశువులకు ఇంజక్షన్స్, మాత్రలు ఇచ్చారు. 45 దూడలకు నట్టల నివారణ మందు తాపించారు.కార్యక్రమంలో టీకూరుపేట పశువైద్యులు శివశ్రీనివాసులరెడ్డి, అనిమెల్ హస్బెండరీ అసిస్టెంట్లు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన



బురదమయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామం నుంచి కేసీ చాపాడు కాలువ వైపు నుంచి తొండలదిన్నె పంట పొలాలకు వెళ్లే రహదారి గురించి వార్త గురువారం సాక్షిలో 'సారూ.. ఈ దారి వంక సూడరూ..!' అనే వార్త ప్రచురితమైంది. ఈ క్రమంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆ దారిని ఏరువపాళెం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ రహదారిని బాగు చేసేందుకు నాలుగు కిలోమీటర్ల మేర రూ.29 లక్షలతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. త్వరలో ఆ రోడ్డుకు మహర్దశ రానుండటంతో అక్కడి రైతులు, కూలీలు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ

కలసపాడు : ప్రభుత్వ పాఠశాలలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు చెముడూరి నాగేంద్రరావు, నూతలపాటి హరిప్రియ దంపతులు వాటర్ కూలర్ అందించడం అభినందనీయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎల్.కమాల్‌లు తెలిపారు. మండలంలోని ఎగువ రామాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కోరిక మేరకు గురువారం నాగేంద్రరావు దంపతులు పాఠశాలకు వాటర్ కూలర్ యంత్రాన్ని విరాళంగా అందించారు. ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. 42, 43, 44 సచివాలయాల పారిశుద్ధ్య సిబ్బంది చేపట్టిన బుర్రసాధు మఠం ప్రాంతంలో కాలువల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. బొల్లవరం హరిజనవాడలో మడూరు కాలువ వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను సిబ్బందితో తొలగింపజేశారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ల వేలం

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీకి చెందిన అన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న 29 షాపుల రూములకు బాడుగకు ఇచ్చేందుకు గురువారం మున్సిల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో గాంధీ రోడ్డులోని వసంతపేట షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపు నంబర్ 17ను అగ్గారపు శివశంకర్ రూ.10,400 దక్కించుకున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే టీబీ షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్‌ఫ్లోర్ షాపు నంబర్ 3ను లావనూరు సుబ్బరాయుడు రూ.3,900లకు, షాపు నంబర్ 21ను ముచ్చుమర్రి చిన్న ఓబయ్య రూ.91,00 పాట పాడి దక్కించుకున్నారని ఆయన వివరించారు.

లైసెన్స్ తప్పనిసరి



ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు

కలసపాడు : ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు, ఎస్ఐ చిరంజీవిలు తెలిపారు. గురువారం కలసపాడులో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించాలని, పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, మైనర్లకు ఆటోలు ఇవ్వరాదని, ఆటోల్లో వచ్చే మహిళా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు.